07012024-DIS-04_Layout 1 1/7/2024 5:00 AM Page 1



# చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

# అలిశెట్టి.. ఓ నిప్పు పుండు

Where to Start? Everything Cracks
and Shakes, The air Trembles with
Similies, no one world's better than
another, earth moans with
metaphors.
– Osip Mandelstam

**అలిశెట్టి ప్రభాకర్ చనిపోలేదు. ఇప్పడతని స్మృతి వర్తమాన జీవితమే. మరణాన్ని ఓటమి పాలుచేసిన కవిత్వ జీవితం తనది. అతని కవిత్వం తంగేడు వనం. పాఠకునిలో ఎప్పటికీ అనులోమ విలోమాలను శ్వాసిస్తూ.. జీవితాన్ని నిలదీస్తూనే ఉంది. మూడు దశాబ్దాల కిందటనే అలిశెట్టి పాఠకునిలో జ్వర ప్రతిధ్వనిని తన కవిత్వంతో సరిగ్గా, స్పష్టంగా, గాఢంగా, సత్యస్ఫూరకంగా Curate చేశారు. కవిత్వ ప్రదర్శనశాలతో కేవలం భౌతిక ప్రపంచాన్నే కాక, అత్యంత అమానవీయమైన మానసిక లోకాన్ని విస్తృతపరిచిన రూపసార సంగతులు తన కవిత్వ చిత్రాలు. వికృత రాజకీయ చేష్టలని తన కవిత్వంలోని వాస్తవాగ్రహమే దిగంబరపరిచింది. అతని కవిత్వ జీవితమంతా తర్కవితర్కాలకు చోటులేని సామాజిక, రాజకీయ, అంతరంగ విలువల పతన చిత్రాలు. వ్యవస్థీకృతమైన అరాజకీయ మార్కెట్ విధ్వంసాలు.**

అటువంటి Corporate Economy దాడుల్లో మొదటగా రక్తమోడేది సృజనకారులే. అందులోనూ బతుకును నగ్నంగా ఎదుర్కొంటూ మోసే అలిశెట్టి ప్రభాకర్ వంటి కవులే. లెక్కకు దొరకనటువంటి Marginalised కవుల సమూహం ఉదాహరణగా మిగిలే ఉంది. ఉంటుంది కూడా. గుర్తించగలిగే సహన దృష్టి కావాలె మనకు. అప్పుడే ఆ కవుల సమూహాలలో కేంద్ర బిందువులాగా నిలబడి ఉన్న అలిశెట్టి నీడలు గోచరమవుతాయి. అలిశెట్టి ప్రభాకర్ జీవిత కవిత్వంలో మనం చూడటం ఇష్టపడనిదీ, భయపెట్టేదీ అతని మృత్యు నిరాకరణ. Completion of lifeని తను పూర్తిగా నిరాకరించారు. అంతాన్ని పక్కకుపెట్టి బతుకులోని చలనశీలతను ఆఘ్రాణిస్తూ ఇప్పటివరకు కొనసాగుతూనే ఉన్నారు. 'మరణం తన చివరి చరణం కాదు' అంటూ జీవ కవిత్వాన్ని కాపాడుతూ పాఠకుడు కోరుకునే ఒక Supra Logical Validity అలిశెట్టి కవిత్వంలో గర్భస్థమై ఉంది. ఆ కవితా చిత్రాల్లో క్లుప్తత ఉంటుంది. గాఢత ఉంటుంది. సత్యాగ్రహ నెనరు ఉంటుంది. అపురూపమైన మానవీయ మమకారం ఉంటుంది.

> 'గుండె నిండా బాధ కళ్లనిండా నీళ్లున్నప్పుడు/ మాట పెగలదు/ కొంత సమయం కావాలి/ దట్టంగా కమ్ముకున్న విషాద మేఘాలు/ చెల్లాచెదురై/ హృదయం నిర్మలాకాశం కావడానికి కొంత/ వ్యవధి కావాలి' అంటూ స్పష్టతలో గాఢతను చెక్కుతూ పోతుంటారు.

ఆధునిక కవిత్వ దారుల నుంచి నేటి అత్యాధునిక (Post Corona stage Managed) కవిత్వం దాకా కవి తను చీకటిదారుల్లో నడిపే నెగడు వలె ఉంటారు. తను జీవించి సాధించిన సత్యాన్ని, ప్రవక్తలాగా మామూలు రూప చిత్రాలతోనే చెప్పే ప్రయత్నం చేస్తుంటారు. విస్పష్టమైన అర్థాలను ఇస్తూ కూడా మరొక్కసారి వాచకాన్ని తిరిగి అర్థం చేసుకొమ్మనే సూచనను ఇస్తుంటారు. మళ్లీ de-understand చేసుకొమ్మని తన లోపలి, బయటి నిర్మాణాలని, పాలనలని వినిర్మాణం చేసుకుంటూ కొత్త అర్థాలను వెదుక్కోమనీ ప్రోత్సహిస్తూ ఉంటారు. అందుకే నిజమైన కవి ఎప్పటికీ హీరో లేదా నాయకుడే అవుతాడు పాఠకునికి. అలిశెట్టి ప్రభాకర్ వంటి protagonist కవి లాగా.

'వేదనతో/ పండిన/ గుండెను/ పిండి/ ప్రశ్నిస్తే రెండు వైపులా/ కన్నీళ్లు/ మొండిగా/ సమాధానం చెబుతాయి. ('ఎర్ర పావురాలు' సంకలనంలోని కవిత సమాధానం)

'బాంబుని/ చూడగానే/ బెంబేలు పడితే/ అదెప్పుడూ/ నీ గుండెల్లోనే/ పేలుతుంది.' ('ఎర్ర పావురాలు' సంకలనంలోని 'భయం' కవిత నుంచి)

తన చుట్టూ ఉన్న సమాజంలోని వైరుధ్యాలను, రాజకీయ Chaotic పెనుగులాటల్నీ, వ్యక్తుల కుటుంబ సంబంధాల్నీ, తక్కువ పదాలతో దృశ్యాలకు పట్టించారు. నిడివి తక్కువగా ఉన్న కవితలు Visual Narrativeతో సామాన్య పాఠకుడిని ఇబ్బంది పెట్టకుండా గుండెలోకి జారిపోతాయి. మామూలుగా తోచే పదపంక్తిలోని, అసాధారణమైన దుఃఖాగ్రహం మనసుకీ తగులుతూ ఉంటుంది. ముందుగా కవి తాలూకు Melancholy పాఠకుడి Reasoningని ముక్కలు ముక్కలు చేస్తుంది. అతని అనుభవాన్ని గడప దాటిస్తుంది.


ఇది నగర గ్రామీణ కవిలోని ఒక బలమైన భాగం. వద్దనుకుంటూనే నగరానికి వలస రావడం వల్ల భాషతో బలమైన ఎకానమీ చోటుచేసుకుంది. రోజూ కమ్ముకునే guilt తో సహా. ఆ guilt తన ఇంటిని వదిలేసి వచ్చిన నేర భావనలోని పార్శ్వమే కానీ ఇంకొకటి కాదు. వాస్తవ దర్శనమే తన కవిత్వంలోని ఆకర్షణ అంతా.

> **'చీకట్లో జడుసుకుంటే/ ఒక చెట్టే నీ చుట్టూరా/ అరణ్యమై భయపెడుతుంది/ గుండెంటూ కలిగుంటే/ నీ వెంట అదే/ పెద్ద సైన్యమై నిలుస్తుంది' ('మంటల జెండాలు' లోంచి 'గుండె సైన్యం' అన్న కవిత)**

> 'అలా
> సమాధిలా
> అంగుళం మేరన్నా
> కదలకుండా పడుంటే ఎలా
> కొన్నాళ్లు పోతే
> నీ మీద నానా గడ్డీ మొలిచి
> నీ ఉనికి నీకే తెల్సి చావదు'

**('రక్తరేఖ' సంకలనంలోని 'ఉనికి' కవితలోంచి)**

జీవితంలోని ఆగ్రహ చింతన.. కవిత్వ ధ్యానం.. ఇవి రెండింటినీ కలిపి సాధించిన సరళశైలి తనది. చదువుతున్న కొద్దీ, అనుభవం దగ్గరవుతున్న కొద్దీ పాఠకునిలో గాఢత పెరుగుతూ పోతుంటుంది. అందుకే ఇప్పటి తరానికి కూడా ఆయన మిగిలే ఉన్నారు. దుఃఖమూ, ఆకలీ అరకొర జీవితంలోని జరుగుబాటు లేకుండా కాల్చివేసే వేదన లేకుండా అలిశెట్టి ప్రభాకర్ కవిత్వమే లేదు.



అడవిలో గాయపడిన జింక పిల్ల లాగా పులిని రెచ్చగొడుతూ తప్పించుకుంటూ ఎంతో ఎత్తుకు ఎగురుతూ, తను ఎంచుకున్న కవిత్వ మార్గంలో జీవించినట్టు అనిపిస్తుంది. తన చుట్టూ కమ్ముకొని ఉన్న రాజకీయ, సామాజిక వ్యవస్థలోని హింసా ప్రవృత్తికి జవాబుగా అలిశెట్టి కవిత్వాన్ని నిలబెట్టుకున్నారనిపిస్తుంది. తనలో ఉన్న స్పందనాగుణం ప్రేమ, స్నేహ గుణం, మృత్యువును బతుకులోంచి బహిష్కరించగలిగింది. సాటి మనిషి బాగుకోసం, అసమానతలను రద్దుచేసే స్వప్న సాక్షాత్కారాన్ని ఆయన కోరుకున్నారు. తను నిద్ర నుంచి లేచినప్పుడల్లా... తనకంటే ముందే లేచి నిలిచి ఉన్న వేదనతో.. సోపతి చేస్తూ జీవించగలిగారు. తన మార్గాన్ని ఎవరూ ఎంచుకోలేరు. అది ఇప్పటి కార్పొరేట్ పద్మవ్యూహ జీవితాన్ని నిలువరించడానికి వేగం తగ్గించడానికి Antidote లాగా పనిచేస్తుంది.

రాజకీయాల, జెండాల, సిద్ధాంతాల మత మౌఢ్యాల తొక్కిసలాటలో తప్పిపోతూ రక్తసిక్తమవుతున్న మనిషిని కవి అలిశెట్టి ప్రభాకర్ అచ్చమైన కవుల సరసన నిలబడి వెతుక్కుంటూనే ఉన్నారు తన కవిత్వం ద్వారా. చిక్కడ్‌పల్లి, సునందా, గుల్షన్ ఇరానీ కేఫ్ గల్లీలు, నల్లకుంట, రాంనగర్ చౌరస్తాలు, మేదరబస్తీ చ్యాటల బొంగుల దుకాణాలు, బర్కత్‌పురా చౌరస్తా నడుమ నరికివేసిన రాగిచెట్టు, దాని ఊడలకు వేలాడదీసిన కందీళ్ల రిక్షా స్టాండ్‌లూ Fade in Fade out అవుతూ, dissolve అవుతూ తిరిగి నిద్రలేసే అతని చిత్రాక్షర రేఖలూ కవిత్వ క్షణ నిముషాలు ఎన్నెన్నో...

తనతో చివరిసారి సిటీ సెంట్రల్ లైబ్రరీలో కవిత్వ వేదిక పంచుకున్న పొగ దిగులు జ్ఞాపకం పచ్చిగానే ఉంది. అక్కడ తను 'మరణం నా చివరి చరణం కాదు' కవిత చదువగానే నేను ఎంతో బాగుందనగానే నన్ను గట్టిగా కౌగిలించుకొని నవ్వుతూ.. అశోక్‌నగర్ గల్లీల్లోకి వెలుతురు నీడగా నడుచుకుంటూ వెళ్లిపోయాడు.. కవిత్వాన్ని వెతుక్కుంటూ తన రూపశాలను జారవిడిచి మరొక సమాగమం కోసం దోస్తులను వెతుక్కుంటూ. నేను అతని Hypnotic నీడలో నిలబడిపోయాను పాఠకుని సమూహంలో. అతను ఇప్పటికీ పలకరిస్తూనే ఉన్నాడు. 'మరణం నా చివరి చరణం కాదు' అంటూ.. నేను తన వాక్యాన్ని పాటగా మలుచుకొని ఉన్నాను. అతను తన కవితను విన్పిస్తూనే ఉన్నాడు.

> 'పడుకొని ఉన్నా / గుండె /
> గడియారమవుతుంది /
> ఒక్కొక్కప్పుడది/
> నిద్ర పట్టనివ్వని/ అలారమవుతుంది'

**(ఎర్ర పావురాలు' సంకలనంలో ని 'గుండె' అనే కవితలోంచి)**



**కవి సిద్ధార్థ**
73306 21563

"Wild honey smells
of freedom the dust of
sun light the month of
a young girl, like a
violet but gold-
smells of nothing".
– anna akhmatova

## నాడూ నేడూ కవితల ప్రభాకరుడు



పద్దెనిమిదేళ్ల వయస్సులో
ప్రణయభావాలతో ఊహల్లో విహరించకుండా
వేదనాభరితమైన తన కవితాక్షరాలను
బాధల పలకపై దిద్దుకుంటూ..
'ఎల్లలు లేని కవితాకాశంలో
ఎవరెవరి బాధలైనా రాస్తా,
క్షమించండి నా ఒక్కడివి మాత్రం దాస్తా' అంటూ
మెజారిటీ ప్రజల బాధలు, గాథలు ముడిసరుకుగా తీసుకొని
విశాల హృదయంలో రాయడం మొదలుపెట్టాడు అలిశెట్టి ప్రభాకర్!

'తను శవమై.../ ఒకరికి వశమై..../
తనువు పుండై.../ ఒకరికి పండై../
ఎప్పుడూ ఎడారై.../ ఎందరికో ఒయాసిస్సై..' అనీ
ఆరు పంక్తుల మినీ కవితలోనే
క్రియా పదం లేకుండా అసంపూర్తిగా వదిలేసి
అనంత బాధాకావ్యమైన వేశ్యా జీవితాన్ని
స్ఫురింపజేస్తూ సమాజం గుండెను కదిలించిన కవి అలిశెట్టి ప్రభాకర్!

చెమట బిందువునూ, కన్నీటి బొట్టునూ పరిశోధించి
బాధలకు పరిధి లేదని చెప్పిన పరిశోధక కవి అలిశెట్టి ప్రభాకర్!

సామాన్యుడి జీవిత వృత్తాంతం
ఎప్పుడూ కష్టాలు ఇమిడి ఉండే ఒక బిందువు
అతన్నాధారం చేసుకొని గీసుకునే
వృత్త వైశాల్యాలే సంపదలు సౌఖ్యాలు సాధాలు - అని
చరిత్ర చెప్పని గణితాన్ని చెప్పిన గణిత కవి అలిశెట్టి ప్రభాకర్

'నను తొలిచే బాధల ఉలే
నను మలిచే కవితా శిల్పం' అని చెప్పి
'శనివారం/ అదొక షోరూం' అని మూడు పదాలతో,
'మెడలు వంచి శ్రమించేవాడిని/
వరించనిదే గోల్డ్ మెడలు' అని రెండు వాక్యాలతో,
'సమిష్టి బాధల/ సుదీర్ఘ శ్వాసే/ ఒక/ ఊరేగింపు'
అని నాలుగు వాక్యాలతోనూ
పవర్‌ఫుల్‌గా మినీ కవితలు రాస్తూ,
వలపు బాధలు చెప్పకుండా
బాధితుల వగపు బాధలు చెప్తూ
'సిద్ధాంతగ్రంథ సారమేదీ వడబోయకున్నా
సిద్ధార్థుడు వదిలివెళ్లిన ఈ రాజ్యమ్మీద'
'ఎర్రపావురాలు' కవితా సంపుటి మొదలుకొని
'మరణం నా చివరి చరణం కాదు' వరకూ
పేదా, నిరుపేదా, కార్మిక, శ్రమ జీవులపై
పెద్ద కవితలూ, దీర్ఘ కవితలూ రాసిన అలిశెట్టి ప్రభాకర్-

'ఎన్నెన్ని / గాయపడిన ఉదయాల్ని/
సంకలనంగా మార్చినా ఎవరెవరి బాధామయగాథల్ని/
ఈ కలంతో జాలువార్చినా / మిత్రుడా/
నిరంతరం సూర్యుడే నా ముఖచిత్రం' అని
చెప్పుకొన్న కవి రవి అలిశెట్టి ప్రభాకర్!

అలిశెట్టి ప్రభాకర్ మరణించినా
చిత్రలేఖన స్పష్టరేఖల స్వభావం,
కెమెరా కన్ను నిశితదృష్టి కలగలిసిన
ఆ కలం సృష్టించిన వాడీ, వేడీ కవితలతో
ఇప్పటికీ ఎప్పటికీ జీవిస్తూనే ఉంటాడు!!



పెన్సిల్ డ్రాయింగ్, కవిత:
రఘువర్మ

**(జనవరి 12న అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి సందర్భంగా...)**

## ప్రకటనలు

### 'అంతర్వాణి' సమావేశం

2024, జనవరి 7వ తేదీన ఉదయం 10.30 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ఆధ్వర్యంలో 'అంతర్వాణి' సమావేశం జరుగనున్నది. ప్రసిద్ధ కవి నిఖిలేశ్వర్ తన జీవన ప్రయాణాన్ని వివరిస్తారు. తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు కందుకూరి శ్రీరాములు ఈ సమావేశానికి అధ్యక్షత వహించనుండగా, తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ సంపత్‌కుమార్ సమన్వయ పరుస్తారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు, సాహితీవేత్తలు పాల్గొంటారు.

### కథలకు 'ఆహ్వానం'

తెలుగు నూతన సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా బాలల్లో సాహిత్యాభిరుచి పెంపొందించాలనే ఉద్దేశంతో సిద్దిపేట జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల నుంచి కథలను ఆహ్వానిస్తున్నాం. ప్రథమ బహుమతి రూ.1,500, ద్వితీయ బహుమతి రూ.1,000 (ఇద్దరికి), తృతీయ బహుమతి రూ.500 (ముగ్గురికి), ప్రత్యేక బహుమతులు రూ.300 (12 మందికి) చొప్పున ఉంటాయి. రచయితలు తమ కథలను 'ఉగాది కథల పోటీ', ప్రతిభ డిగ్రీ కళాశాల, మెదక్ రోడ్, సిద్దిపేట-502103 చిరునామాకు 2024 జనవరి 31లోపు పంపించాలి. కథతో పాటు హామీ పత్రం తప్పనిసరి. వివరాలకు 99590 07914 నంబర్‌ను సంప్రదించండి.

**- భైతి దుర్గయ్య, కన్వీనర్, సుగుణ సాహితీ సమితి**

### పురస్కారానికి ఆహ్వానం

ప్రముఖ నటుడు, కవి, నాటక రచయిత, నాట్యాచార్యులు రజనీశ్రీ రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారం కోసం 'నవల'లను ఆహ్వానిస్తున్నట్టు జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు గాజుల రవీందర్, ప్రధాన కార్యదర్శి నంది శ్రీనివాస్ తెలిపారు. 2014 జనవరి ఒకటి నుంచి 2023 డిసెంబర్ 31లోపు ముద్రితమైన స్వీయ నవలలే పంపించాలి. అనువాదాలు స్వీకరించరు. పురస్కార గ్రహీతలకు ప్రశంసాపత్రంతో పాటు రూ.10,116 బహుమతిగా అందించి సన్మానిస్తారు. నవల ప్రతులను.. గాజుల రవీందర్, ఇంటి నంబర్ 8-3-255/1, రామచంద్రాపూర్ కాలనీ, రోడ్ నంబర్ 12, భగత్ నగర్, కరీంనగర్ -505001 చిరునామాకు ఫిబ్రవరి 10లోపు పంపించాలి. వివరాలకు 98482 55525 లేదా 94904 01861 నంబర్లను సంప్రదించండి.

### పుస్తకాల పరిచయ సభ

మహబూబ్‌నగర్ న్యూటౌన్‌లోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో 2024 జనవరి 7న ఆదివారం ఉదయం 10 గంటలకు వల్లభాపురం జనార్ధన రచించిన నాలుగు పుస్తకాల పరిచయ సభ, తెలంగాణ సాహితీ సలహాదారులు వైద్యం భాస్కర్ రచించిన పాటల సీడీ విడుదల కార్యక్రమం జరుగనున్నది. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొంటారు. కవి వైద్యం భాస్కర్, తెలంగాణ సాహితీ గౌరవాధ్యక్షులు సురభి జగపతిరావు అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. కవులు టీవీ భాస్కరాచార్య, తంగిరాల చక్రవర్తి ముఖ్య అతిథులుగా, విజేత వెంకటరెడ్డి ఆత్మీయ అతిథిగా రానున్నారు. వనపట్ల సుబ్బయ్య, బోల యాదయ్య, సుభాషిణి, పరిమళ్, బాదేపల్లి వెంకటయ్య గౌడ్, ఎండీ ఖాజా మైనొద్దీన్, ప్రమోద్ కుమార్ తదితరులు హాజరుకానున్నారు.

## నీడలను ఉన్నతీకరించాలి



*ఏం జరుగుతున్నది?*
*శీతల గాడ్పులు*
*అతను ఉన్నప్పుడు మొదలైనవే...*
*చెట్టు కూలే దశకు వేర్లు*
*బలంగా వూనుకొని ఉండవు, అని*
*ప్రజలు బాంధవ్యంతో సర్దుకున్నారు*
*అభిమానపు ఉచ్ఛ్వాసనిశ్వాసలు*
*వేడిగానే వీస్తాయి గుర్తుంది కదా?*
*శీతల క్రియ పూర్తిస్థాయిలో*
*కమ్ముకోలేకపోయింది!*

*ఎన్నెన్నో స్పందనలకు ఆత్మ ఉంటుంది*
*అవమానించబడనీయకండి*
*ఆ వెలిగిన దివిటీ ఇప్పుడే ఆరిపోదు*

*కలిసి నడిచిన నీ మీదే కొన్ని బాధ్యతలు ఉంటాయి*
*ఎంత దుఃఖపడ్డావో, వేదనకు గురికాబడ్డావో*
*వాటి సారం నీకు తెలుసు!*

*నీ కన్నీటి ధార పరాయి చెంగుతో తుడ్చుకోబోకు*
*శత్రువులు వచ్చిపోతున్నారు*
*నీలాంటి త్యాగతల్లులు ఎందరెందరో..*
*నీకు తెలియంది కాదు,*
*ఆ గజ్జెల రవళికి ఉగ్రూతలూగి,*
*ఆగిన హృదయ స్పందనలెన్నో...*
*ఎవరి దుఃఖం ఇంకెవరూ తుడవలేరు*
*మన కన్నీళ్లను మన జ్ఞాపకాల్లో కార్చాలి,*
*సానుభూతిలో కూడా...*
*మాసిపోయిన నీడలను ఉన్నతీకరించాలి!*



**హనీఫ్**
*92475 80946*

# తెలుగు సాహిత్య కళానిధి రాఘవాచారి పీఠం

**సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కేవీ రాఘవాచారి సాహిత్య పరిశోధన పీఠం తెలుగు సాహిత్యంలో కొత్త పుంతలు తొక్కుతున్నది. పరిశోధన కేంద్రంగా, పోటీ పరీక్షలకు అభ్యర్థులను సిద్ధం చేయడంలో తన వంతు పాత్ర పోషిస్తున్నది. తెలుగు వెలుగు విరాజిల్లుతూ భవిష్యత్తు తరాలకు సాహిత్యాన్ని అందిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించింది.**

#### తెలుగు సాహిత్య పరిశోధన పీఠం ప్రారంభం-అసలు లక్ష్యం

కేవీ రమణాచారి తండ్రి రాఘవాచారి జ్ఞాపకార్థం.. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి, ప్రభుత్వ మాజీ సలహాదారు కేవీ రమణాచారి తండ్రి, ప్రముఖ కవి కేవీ రాఘవాచారి సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏండ్ల తరబడి అధ్యాపకులుగా పనిచేశారు. వారి జ్ఞాపకార్థం 2017 ఆగస్టులో ఇదే డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రసాద్ సహకారంతో కేవీ రాఘవాచారి స్మారక పరిశోధన పీఠం స్థాపించారు. పీఠం స్థాపనకు తెలుగుపై ఆయనకున్న మక్కువ, సాహిత్యంపై అభిమానం నాంది పలికాయి. రాష్ట్రంలోనే సాహిత్య పరిశోధన ముఖ్య లక్ష్యంగా ఏర్పాటైన సాహిత్య పీఠం కలిగిన ఏకైక కళాశాల ఇది కావడం గమనార్హం. కళాశాలలో తెలుగు విభాగం పర్యవేక్షణలో ఉండే కేంద్రంలో ఏటా కేవీ రమణాచారి తన సొంత డబ్బులతో 100కు పైగా అరుదైన సాహిత్య పుస్తకాలను అందిస్తున్నారు. ఇప్పటికీ ఈ గ్రంథాలయంలో 2,200 పుస్తకాలతో పాటు, తాళపత్రాలు కూడా అందుబాటులో ఉన్నాయి. చెప్యాల హరినాథ శర్మ, మాజీ మంత్రి హరీశ్‌రావు చేతులమీదుగా ప్రారంభమైన ఈ పరిశోధన కేంద్రం నిత్య తెలుగు పరిశోధన కేంద్రంగా గుర్తింపు పొందింది. కేవీ రాఘవాచారి పేరు మీద ప్రత్యేక అలుమ్ని బ్లాక్ ఏర్పాటు చేసి అందులో పుస్తకాలను అందుబాటులో ఉంచారు.



#### సదస్సులు, ప్రత్యేక వర్క్‌షాప్‌లు

కేవీ రాఘవాచారి స్మారక సాహిత్య పీఠం ద్వారా ఇప్పటివరకు జాతీయస్థాయిలో రెండు సదస్సులు, నాలుగు వర్క్‌షాప్‌లు నిర్వహించారు. 20వ శతాబ్దపు తెలంగాణ పద్య ప్రతిభ పేరుతో 2019లో ఏర్పాటు చేసిన సదస్సులో ఎంతోమంది వక్తలు హాజరై, తెలుగు సాహిత్యం దాని అవసరాన్ని తెలియజేశారు. అంతేకాకుండా ఈ కేంద్రం ద్వారా 2023లో కమనీయ తెలుగు రామాయణంపై నాలుగు వర్క్‌షాప్‌లను నిర్వహించారు. ఈ పీఠం ద్వారా పద్యం, కథ, కవితలపై అధ్యాపకులు ప్రత్యేక శిక్షణ ఇస్తూనే, సింపోజియంపై చర్చలను కొనసాగించారు.

#### సాహిత్య పీఠం ద్వారా 10 పుస్తకాల ప్రచురణ

సాహిత్య పీఠం ఏర్పాటు చేయడం ఒక ఎత్తయితే దానిని కాపాడుకుంటూ తెలుగులో పరిశోధనలు చేస్తూ భవిష్యత్తు తరాలకు సాహిత్యం అందించడం గొప్ప విషయం. ఇందులో తెలుగు విభాగం పూర్తిగా సఫలమైంది. తెలుగు పరిశోధన కేంద్రం ఏర్పాటు తర్వాత ఇప్పటివరకు 10కి పైగా పుస్తకాలు సిద్దిపేట డిగ్రీ కళాశాల ఐఎస్‌బీఎన్ (ఇంటర్నేషనల్ స్టాండర్డ్ బుక్ నెంబర్)తో ప్రచురించారు. ఇందులో తెలుగు సాహిత్యానికి సంబంధించి 8 పుస్తకాలు ఉండగా ఒకటి హిస్టరీ, మరొకటి బయో టెక్నాలజీ సబ్జెక్టులకు సంబంధించినవి ఉన్నాయి. సింహాసన ద్వాత్రింశిక, తాళపత్రాలు, ఆరాధన విద్యా సర్వస్వం, తెలుగు సాహిత్య విమర్శ దర్శనం, రాజస్మయి రహస్యం లాంటి అరుదైన పుస్తకాలు అందుబాటులో ఉండటం విశేషం.

#### పరిశోధనలు, పోటీ పరీక్షలకు నెలవు

సిద్దిపేట సాహిత్యపీఠం చేస్తున్న కృషి అటు తెలుగు సాహిత్యాన్ని భవిష్యత్తు తరాలకు అందించడానికి పరిశోధనలు మాత్రమే కాకుండా నేటితరం విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవ్వడానికి అనేక పుస్తకాలు అందుబాటులో ఉంచారు. ఇప్పటికే ఇక్కడ పరిశోధన చేసిన ఆరుగురు విద్యార్థులు నెట్-సెట్ లాంటి జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచారు. మరో విద్యార్థి పీహెచ్‌డీ జూనియర్ ఫెలోషిప్ సాధించాడు. మరో ఏడుగురు విద్యార్థులు పోలీస్ కానిస్టేబుల్ పరీక్షల్లో ఉత్తీర్ణులవడం చెప్పుకోదగ్గ విశేషాలు. అలాగే తెలుగు సాహిత్యంలో ప్రతి సంవత్సరం ప్రతిభ చూపిన విద్యార్థులకు రాఘవాచారి పేరు మీద బంగారు పతకాలు కూడా అందిస్తున్నారు. ప్రతిరోజు దాదాపు 40 నుంచి 50 మంది విద్యార్థులు లైబ్రరీని సందర్శించడం, ఇక్కడ పుస్తకాలు చదువడంతో పాటు, తాళపత్రాలపై పరిశోధన చేస్తున్నారు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేశారు. http// kvraghavacharyasspeetamblogspot.com సందర్శించవచ్చు.

**- కొమురవెల్లి అంజయ్య, 98480 05676**

## హిమ దీపం



*అప్పుడే విచ్చుకొన్న*
*ఆకుపచ్చని కుదుళ్లలో*
*మంచు బిందువుల లయలు,*
*హంగుల ఆకృతులు ఆవిష్కృతమవుతూ*
*ఆకాశం అద్భుత వన్నెల్ని చిలకరిస్తోంది*
*జానపద లయల్లో*
*ఓలలాడిన పచ్చని మాగాణికి*
*కొత్త హంగులేవో అబ్బినట్టు*
*తన్మయత్వపు తుషార సింధువులా*
*ఆశల మేఘమై తబ్బుబ్బి*
*విను వీధుల్లో వీర విహారం సాగిస్తోంది*

*కొన్నాళ్ల ముచ్చటైనా...,*
*కొండా, కోనా.., ఊరూ, వాగూ...*
*తుళ్లింతల తూనీగలా*
*తొలిపొద్దును మోసుకొస్తోంది*
*చలి గిలిగింతలు ఎన్నున్నా...*
*వెన్నెల వైపు మది పరిగెడుతోంది*
*మంచు అంటే*
*నాలుగు చుక్కల*
*బిందువు కాదు*
*చెట్టు, చిగురుకూ..*
*మనిషికీ, మనసుకూ..*

*నేలకూ, నింగికీ..,*
*అదొక ఆత్మీయ ఆలింగనం*
*మంచు బిందువుల సమ్మేళనం*
*ఉషోదయానికి ముందే*
*మంచు తెరల రాకతో*
*ఊరొక్క ఉషస్సుల సంగమం*
*చెట్టూ, చేల పులకింతల*
*సంగీతం*
*చూసి తరించే కళ్లకు*
*అద్భుతాలను ఆవిష్కరించే*
*హంగుల హిమదీపం..!*



**మహబూబ్ బాషా చిల్లెం**
95020 00415